నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 2 నవంబర్ 2024 | HYDERABAD


## అధిక రాబడి ఆశచూపి...రూ.7 కోట్లతో ఎగనామం

సిటీబ్యూరో: 'మా కంపెనీలో పెట్టుబడులు పెట్టండి. తక్కువ కాలంలో అధిక రాబడి వస్తుంది' అంటూ అమాయకులకు ఆశ చూపి రూ.7కోట్లతో ఎగనామం పెట్టిన ఓ ఘరానా మోసగాడిని ఈవోడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ ప్రసాద్ కథనం ప్రకారం...కాకినాడకు చెందిన విజ్జి జగదీశ్ చంద్ర ప్రసాద్ కూకట్‌పల్లిలోని హైదర్‌నగర్‌లో నివాసముంటున్నాడు. కూకట్‌పల్లిలోని డీబీ స్టాక్ బ్రోకరింగ్ కన్సల్టెన్సీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.ప్రొప్రైటర్ దీపాంకర్ బర్మన్‌తో కలిసి అమాయకుల నుంచి వివిధ స్కీమ్‌ల పేరుతో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేయాలని పథకం పన్నారు. తమ కంపెనీలో ఒక సంవత్సర కాలం పెట్టుబడులు పెడితే ఏడాదికి పెట్టిన పెట్టుబడిపై 120 శాతం లాభాలు ఇస్తామని, ఆరు నెలల కాలం పెట్టుబడి పెడితే 54 శాతం, మూడు నెలల పాటు పెట్టుబడి పెడితే 24 శాతం, నెలరోజులు పెడితే 7 శాతం చొప్పున లాభాలు చెల్లిస్తామంటూ ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. రూ.7 కోట్ల వరకు పెట్టుబడుల రూపంలో వసూలు చేసిన నిందితులు లాభాలు, పెట్టుబడి రూపంలో తీసుకున్న డబ్బులను చెల్లించకుండా బిచాణా ఎత్తేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు శమాయి.. పంచాక్షర్ తమకు జరిగిన మోసంపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడు జగదీశ్ చంద్రప్రసాద్‌ను శుక్రవారం పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు దీపాంకర్‌ను ఇటీవలే అస్సోం పోలీసులు అరెస్టు చేశారు.

## పటాకుల మోత.. వాయు కాలుష్యం రెట్టింపు



సిటీబ్యూరో:దీపావళి నేపథ్యంలో గురువారం రాత్రి నగరంలో వాయు కాలుష్యం గణనీయంగా పెరిగింది. ఒక్క మలక్‌పేటలోనే 335 ఏక్యూఐ పాయింట్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీపావళి సందర్భంగా పటాకులు కాల్చడం, వాటి నుంచి వెలువడిన పొగతో వాతావరణం కలుషితమైంది. ఫలితంగా గాలిలోని నాణ్యత స్థాయి ఒక్కసారిగా పడిపోయింది. శుక్రవారం హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 171 పాయింట్లుగా ఉంది. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వివరాల ప్రకారం.. సోమాజిగూడ, న్యూమలక్‌పేట, సనత్‌నగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్, కొంపల్లి, ఆబిడ్స్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో అధిక వాయు కాలుష్యం ఉంది. పీఎం 2.5 కాలుష్య వివరాల ప్రకారం.. పాశమైలారంలో ఏక్యూఐ 163 పాయింట్లు ఉండగా, యూఎస్ కాన్సులేట్ వద్ద 161, సోమాజిగూడలో 161, న్యూమలక్‌పేటలో 159 పాయింట్లు నమోదైంది.

# కంటోన్మెంట్ విలీనం లేనట్లేనా..?

## సంప్రదింపులే తప్ప... ముందుకు పడని అడుగులు... బోర్డు ఎన్నికలపై దృష్టి సారించిన కేంద్రం

సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ) : దీర్ఘకాలంగా లక్షలాది మంది ప్రజలు ఎదురు చూస్తున్న 'జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం' ప్రక్రియ ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదన అటకెక్కినట్లు తెలుస్తున్నది. కేంద్ర రక్షణ శాఖ విలీన ప్రక్రియను దాదాపు పక్కకు పెట్టేసినట్లు విశ్వసనీయ సమాచారం. డిఫెన్స్ ఎస్టేట్స్ వర్గాల అనధికారిక సమాచారం నేపథ్యంలో విలీనానికి బ్రేక్ పడినట్లు బోర్డు వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కంటోన్మెంట్ నూతన చట్టం రూపొందించడంతో పాటు సమీప మున్సిపాలిటీల్లో కంటోన్మెంట్‌ల విలీనం వంటి అంశాలపై నాలుగేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న ఎన్నికల నిర్వహణపై పునరాలోచనలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా పార్లమెంట్ శీతాకాల సమావేశాల నాటికి కంటోన్మెంట్ చట్టాన్ని సవరిస్తూ రూపొందించిన బిల్లు, బోర్డు ఎన్నికల నిర్వహణపై పూర్తి స్థాయి స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు ఢిల్లీ వర్గాలు పేర్కొంటున్నాయి.





### దశాబ్దం కిందటే మొదలైనా..

కంటోన్మెంట్ బోర్డులను శాశ్వతంగా రదు చేయాలని కంటోన్మెంట్లను ఆయా మున్సిపాలిటీల్లో విలీనం చేయాలనే ప్రతిపాదన దాదాపు దశాబ్దం కిందటే సన్నాహాలు మొదలయ్యాయి. ప్రధానంగా కంటోన్మెంట్ల బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై 2018లోనే కేంద్రం సుమిత్ బోస్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. 2019లో ఈ కమిటీ ఇచ్చిన సూచనల మేరకే 'ది కంటోన్మెంట్స్ యాక్ట్ -2006' స్థానంలో నూతన బిల్లును రూపొందించారు. 'ది కంటోన్మెంట్ బిల్-2020' పేరిట రూపొందించిన డ్రాఫ్ట్ బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి అదే ఏడాది శీతాకాల పార్లమెంట్ సమావేశాల ఎజెండాలో చేర్చారు. మరోవైపు కంటోన్మెంట్లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడంపై కూడా అధ్యయనం చేపట్టారు. ఈ నేపథ్యంలోనే గతేడాది జనవరి 4న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంపై చర్చించేందుకు కేంద్రం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఫిబ్రవరి మొదటి వారంలో భేటీ అయిన కమిటీలో ఏం చర్చించారో ఇప్పటికీ బహిరంగంగా వెల్లడించకపోవడం గమనార్హం. ఈ తరుణంలోనే 2023 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా కంటోన్మెంట్ల ఎన్నికల నిర్వహణకు కేంద్రం నోటిఫికేషన్ వెలువరించింది. మార్చిలో ఎన్నికల ప్రక్రియను అర్ధంతరంగా నిలుపుదల చేస్తూ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంది.

### కదలిక లేని విలీనం...

ఈ ఏడాది జూన్ 25న రక్షణ శాఖ సెక్రెటరీ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, కంటోన్మెంట్ అధికారులపై కంటోన్మెంట్ విలీనంపై అనేకసార్లు చర్చించి అభిప్రాయాలు సేకరించారు. ఈ విషయంలో ఎలాంటి కదలిక లేకపోవడంతో పాటు కంటోన్మెంట్ విలీనం అత్యంత క్లిష్టమయ్యే ప్రక్రియగా తేలడంతో విలీన ప్రతిపాదనకు కేంద్రం స్వస్తి పలికిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు ది కంటోన్మెంట్స్ యాక్ట్ 2006 స్థానంలో రూపొందించిన నూతన బిల్లులో పలు కీలక సవరణలు కూడా చేసింది. అయితే నాలుగేళ్లుగా ఈ బిల్లుకు మాత్రం మోక్షం లభించడం లేదు. పైగా గతేడాది ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసి, అర్ధంతరం నిలిపివేయడంపై కూడా పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడేళ్లుగా కంటోన్మెంట్లలో ప్రజాప్రతినిధులు లేకుండానే పాలన సాగుతూ ఉండటం విశేషం. దీంతో వీలైనంత త్వరగా కంటోన్మెంట్లకు ఎన్నికలు నిర్వహించాలని రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. 2014 అక్టోబర్‌లో కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల కోసం నోటిఫికేషన్ వెలువరించి పదేండ్లు పూర్తికావడం గమనార్హం.

### అభివృద్ధికి ఆమడదూరంలో..


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. అయినా.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మౌలిక సదుపాయాల కల్పన నామమాత్రమే. రక్షణ శాఖ నుంచి ప్రత్యేక నిధులు విడుదల కావు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ఇక్కడి ప్రజలకు అందుతున్నాయి. కానీ.. రోడ్లు, మంచినీరు, కమ్యూనిటీ హాళ్లు తదితర సదుపాయాలకు పరిమిత స్థాయిలోనే నిధులు అందుతున్నాయి. భద్రత పేరిట తరచూ కంటోన్మెంట్‌లోని పలు ప్రధాన, అంతర్గత రోడ్లను స్థానిక మిలిటరీ అధికారులు మూసివేస్తున్నారు. దీంతో ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే లక్షలాది మంది అసౌకర్యానికి గురవుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాల్సిందిగా ఇక్కడి ప్రజలు దశాబ్దాలుగా విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ రాష్ట్రం వరకు కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని అనేకసార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోయింది. తాజా పరిణామాలతో విలీనంపై ఉన్న ఆశలు సైతం ఆవిరైపోతున్నాయి.

### కంటోన్మెంట్‌లో స్థలాల విభజన ఇలా..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో మిలిటరీ స్థావరాలు ఉండటంతో పాటు ప్రజల నివాసాలు, ఖాళీ స్థలాల ఆధారంగా వివిధ కేటగిరీలుగా స్థలాలను విభజించారు.

### కేటగిరీల వారీగా ఎకరాలివి..

- ఏ-1 కేటగిరీలో **5,673** ఎకరాలు
- ఏ-2 కేటగిరీలో **4** ఎకరాలు
- బీ-1 కేటగిరీలో **417** ఎకరాలు
- బీ-2 కేటగిరీలోని **2728** ఎకరాలు
- బీ-3 కేటగిరీలో **486** ఎకరాలు
- బీ-4 కేటగిరీలో **90** ఎకరాలు
- సీ-కేటగిరీలోని **228** ఎకరాలు



ఏ-1, 2 కేటగిరీలోని భూములు ఆర్మీ వినియోగంలో ఉన్నాయి. బీ-1 కేటగిరీలోని భూములు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. బీ-2 కేటగిరీలోని భూములు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రైవేటు స్థలాలు ఉన్నాయి.

బీ-4 కేటగిరీలోని భూములు రక్షణ శాఖ పరిధిలో ఉన్నాయి. సీ-కేటగిరీలోని స్థలాల కంటోన్మెంట్ బోర్డుకు చెందినది. బీ-3 కేటగిరీ భూములు రక్షణ శాఖ పరిధిలో ఉంటాయి. బీ-2 కేటగిరీలోని భూముల్లో ప్రజలు నివాసముంటున్నారు. తిరుమలగిరి, మారేడ్‌పల్లి, అమ్ముగూడ, హకీంపేట, కార్ఖానా, బోయిన్‌పల్లి, రసూల్ పురా, కౌకూర్, బొల్లారం వంటి కాలనీలు ఇందులో ఉన్నాయి. కంటోన్మెంట్ పరిధిలో 2011 జనాభా లెక్కల ప్రకారం 2,17,910 మంది ప్రజలు నివాసముండగా, ప్రస్తుతం దాదాపు 4 లక్షల మంది ఉన్నట్లు కంటోన్మెంట్ బోర్డు అంచనా.

## మద్యం మత్తులో నిప్పంటుకొని ..

బంజారాహిల్స్, నవంబర్ 1: మద్యం మత్తులో ఉన్న వ్యక్తికి ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రోడ్ నంబర్ .1లోని హిందూ శ్మశానవాటికలో దీపావళి సందర్భంగా గురువారం రాత్రి నుంచి కొందరు వ్యక్తులు తమ కుటుంబసభ్యుల సమాధుల వద్ద దీపాలు వెలిగించారు. అదే ప్రాంతంలో తిరుగుతున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి (45) శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో శ్మశానవాటికలో వళ్లంతా మంటలతో కనిపించాడు. గమనించిన జీహెచ్ఎంసీ స్వీపర్లు జ్యోతి, సీత అతడి వద్దకు వెళ్లి అక్కడున్న బోరింగ్‌లో నుంచి నీళ్లు తోడి మంటలు ఆర్పేందుకు యత్నించారు. అయినా మంటలు ఆరకపోవడంతో సదరు గుర్తుతెలియని వ్యక్తి కాలుతున్న శరీరంతోనే రోడ్డుమీదకు పరుగులు పెట్టాడు. దీంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. స్థానికులు అతడి వంటి మీద దుప్పటి వేసి మంటలు చల్లార్చి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఘటనా స్థలానికి చేరుకున్న బంజారాహిల్స్ పోలీసులు విచారణ చేపట్టారు. మద్యంతో మత్తులో సమాధుల వద్ద పెట్టిన దీపానికి తాకడంతో దానిలోని నూనె ఒలికిపోయి మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## పూజగదిలో దీపంతో.. ఫ్లాట్‌లో మంటలంటుకొని...

హిమాయత్‌నగర్, నవంబర్ 1: అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్ వీధి నం. 18లో ఉన్న కీర్తి శిఖర అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులోని 403 ఫ్లాట్‌లో న్యాయవాది చంద్రశేఖర్ తన కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. దీపావళి పండుగ నేపథ్యంలో గురువారం రాత్రి పూజ గదిలో దీపం పెట్టి బర్కత్‌పురలో తన కార్యాలయంలో పూజలు చేసేందుకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. వారు వెళ్లిన కొద్దిసేపటికే ఆ ఫ్లాట్‌లో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఫ్లాట్‌లో దట్టమైన పొగలు వచ్చి మంటలు వ్యాపించాయి. పక్క ఫ్లాట్‌లో నివాసముండే వారు మంటలను గమనించి.. లోపలి నుంచి భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఎస్ఐ షఫీ ఘటన స్థలానికి చేరుకుని అగ్ని మాపక సిబ్బందిని పిలిపించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఫ్లాట్‌లో ఉన్న విలువైన ఫర్నిచర్, సామగ్రి, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరుగక పోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## హోటల్ రేటింగ్ సర్వే టాస్క్‌లంటూ..దోపిడీ

సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా ఉన్న హోటల్స్ సర్వే చేసి వాటికి రేటింగ్ ఇస్తే రోజు భారీగా సంపాదించవచ్చని నమ్మించి ఓ వ్యాపారి నుంచి సైబర్‌నేరగాళ్లు రూ. 28 లక్షలు దోచుకున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన బాధితుడికి వాట్సాప్‌లో సందేశం వచ్చింది. ఒక్కో సర్వే, రేటింగ్‌కు రూ. 100 ఇస్తారంటూ సందేశమున్నది. బాధితుడు 3 సర్వేలు చేయడంతో రూ. 300 అతడి బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఆ తరువాత 'మీరు రూ. 2 వేలు పెట్టుబడి పెట్టండం'టూ నమ్మించి వెంటనే రూ. 2800 ఇచ్చారు. చివరకు రూ. 1,28,000 పెట్టుబడి పెట్టడంతో మోసం చేయడం మొదలుపెట్టారు. 'మీరు పంపించిన డబ్బులో క్రిప్టోలో మార్చడంలో ఇబ్బంది అయ్యిందని, మరో టాస్క్ చేయాలంటూ సూచించారు. ఈ క్రమంలో 30 శాతం ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలంటూ నమ్మించి.. బాధితుడి వద్ద నుంచి దఫ దఫాలుగా రూ. 28.45 లక్షలు కాజేశారు.

## పీస్ వెల్ఫేర్‌లో యువతకు ప్రాధాన్యమివ్వాలి

సిటీబ్యూరో: పీస్ వెల్ఫేర్ కమిటీల్లో యువతను ప్రోత్సహిస్తూ వారికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. శుక్రవారం కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో అన్ని జోన్లకు నుంచి వచ్చిన సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీల సభ్యులతో సమావేశమయ్యారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, స్థానిక పోలీసులకు సహకరించాలని సూచించారు. హైదరాబాద్ ఖ్యాతిని కాపాడేందుకు అవిశ్రాంత కృషిని కొనసాగించాలని కమిటీ సభ్యులను సీపీ కోరారు. సమావేశంలో నగర అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, విశ్వప్రసాద్, డీసీపీ చైతన్యకుమార్, స్నేహామెహ్రా పాల్గొన్నారు.

## సంబురంగా సదర్



నగరంలోని నార్సింగి, ఖైరతాబాద్‌లో శుక్రవారం సదర్ సంబురాలు అంబరాన్నంటాయి. దున్నపోతుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# సర్కారు స్థలం..కబ్జాకు యత్నం

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి, గండిమైసమ్మ-దుండిగల్ మండల పరిధిలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. సర్కారు స్థలాలు కబ్జాకు గురవుతున్నా.. అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కనీసం ప్రజలు ఫిర్యాదు చేసినా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా మండల పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు మాయమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లేదారిలోని వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమార్కులు మట్టిని నింపి.. చదును చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దొమ్మరపోచంపల్లి గ్రామం, సర్వే నంబర్ 120/24 ప్రభుత్వ భూమిలో కొన్ని రోజులుగా కొందరు వ్యక్తులు వందలాది టిప్పర్ల ద్వారా మట్టిని వేస్తూ.. జేసీబీతో చదును చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సదరు స్థలం గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని ఉండటంతో పాటు ఎదురుగా దుండిగల్ పోలీస్‌స్టేషన్, కూతవేటు దూరంలో తహసీల్దార్, మున్సిపాలిటీ కార్యాలయాలు ఉండటంతో ఇక్కడి భూమికి గజం లక్షల్లో ధర పలుకుతున్నది. దీంతో విలువైన ప్రభుత్వ భూమిని ఎలాగైనా..ఆక్రమించుకునేందుకు కొందరు రాత్రికి రాత్రి మట్టిని నింపి చదును చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం అధికారులకు తెలిసినా.. ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని, సదరు ప్రభుత్వ భూమిని కాపాడాలని



స్థానికులు కోరుతున్నారు. కాగా, ఈ విషయమై మండల రెవెన్యూ అధాకారులను సంప్రదించగా, ఎవరూ స్పందించకపోడం గమనార్హం.

## వేగంతో వచ్చి.. గోడను ఢీకొట్టి..

బంజారాహిల్స్, నవంబర్ 1: అదుపుతప్పిన వేగంతో వచ్చిన ఓ కారు బంజారాహిల్స్‌లో బీభత్సం సృష్టించింది. కేబీఆర్ పార్కు బయట ప్రహరీని, గ్రిల్స్‌ను ఢీకొట్టింది.బంజారాహిల్స్ రోడ్ నం. 6లో నివాసముంటున్న ఉత్సవ్ దీక్షిత్ (33) ప్లాస్టిక్ కంపెనీకి ఎండీగా ఉన్నాడు. శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో ఫిలింనగర్ వైపు నుంచి బంజారాహిల్స్ రోడ్ నం. 10 వైపునకు కారులో వేగంగా వస్తున్నాడు. కళింగ చౌరస్తా నుంచి క్యాన్సర్ అస్పత్రి వైపునకు వెళ్తున్న కారు యూటర్న్ సమీపంలో ప్రమాదరకమైన మలుపు వద్ద అదుపు తప్పింది. అతివేగంగా వస్తూ ఎడమవైపు ఉన్న పుట్‌పాత్ మీకు ఎక్కడంతో పాటు కేబీఆర్ పార్క్ బయట జీహెచ్ఎంసీ వాక్‌కే చెందిన ప్రహరీని, గ్రిల్స్‌ను ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా గాల్లోకి ఎగిరి భారీ వృక్షాన్ని ఢీకొట్టి అగిపోయింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కాగా, బెలూన్లు తెరుచుకోవడంతో ఉత్సవ్ ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు.



# బెంగళూరుకు హైడ్రా బృందం

- చెరువుల పునరుజ్జీవంపై అధ్యయనానికి స్టడీ టూర్
- వచ్చిన వెంటనే నాలుగు చెరువుల సుందరీకరణ



సిటీబ్యూరో, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన బృందంతో కలిసి మరో నాలుగు రోజుల్లో కర్ణాటక రాజధాని బెంగళూరు సిటీలో పర్యటించనున్నారు. చెరువుల పునరుజ్జీవంపై బెంగళూరులో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించడానికి కమిషనర్ అక్కడికి వెళ్తున్నారు. ఇటీవల రంగనాథ్ లేక్‌మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్‌మల్లి గవాడ్‌తో హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆ సమయంలో బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ జరిగిన తీరుపై చర్చించారు. మురుగుతో నిండి, నీళ్లు లేకుండా ఉన్న చెరువులకు ఎలా పునరుజ్జీవం కల్పించారో తెలుసుకున్నారు. ఈ క్రమంలో బెంగళూరు వెళ్లడానికి హైడ్రా టీమ్ సిద్ధమైంది. బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ, మురుగునీరు స్వచ్ఛంగా మార్చిన విధానంపై హైడ్రా కమిషనర్ అక్కడి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. అక్కడ పునరుద్ధరణ జరిగిన చెరువులపై స్టడీ చేసి..ఆ విధానాలను హైదరాబాద్‌లో ఎలా వర్తింపచేయాలో ప్రభుత్వంతో చర్చించనున్నామని హైడ్రా అధికారులు చెబుతున్నారు. చెరువులు మాత్రమే కాకుండా కొద్దిరోజుల కిందట డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై బెంగళూరు మాజీ డైరెక్టర్‌తో సమావేశమై మేనేజ్‌మెంట్ విధి విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూశారు. ఈ నేపథ్యంలో బెంగళూరులో చెరువుల పునరుజ్జీవనంపై క్షేత్రస్థాయిలో స్థితిగతులను అధ్యయనం చేయడం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో అనుసరించిన విధానాలను పరిశీలించడం కోసం హైడ్రా టీమ్ బెంగళూరు వెళ్లనున్నది. అక్కడ చెరువుల అధ్యయనం తర్వాత బాచుపల్లిలోని ఎర్రగుంట చెరువు, మాదాపూర్‌లోని సున్నంచెరువు, కూకట్‌పల్లిలోని నల్లచెరువు, రాజేంద్రనగర్‌లోని అప్పచెరువులకు పునరుజ్జీవం కల్పించాలని నిర్ణయించారు.

ఒక వర్షం పడితే బెంగళూరులో రహదారులే కాదు.. అపార్ట్‌మెంట్లకు అపార్ట్‌మెంట్లే వరదనీటిలో మునిగిపోతున్నాయి. మెట్రో రైళ్లు ఉన్నా కూడా ట్రాఫిక్ సమస్యకు ఇప్పటికీ తెరపడలేదు. బెంగళూరు తరహాలోనే హైదరాబాద్‌లోనూ ట్రాఫిక్ సమస్య ఉంది. హైదరాబాద్‌ను కూడా వరదలు ముంచెత్తాయి. అయితే బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిపుణులతో హైడ్రా అధికారులు సమావేశంపై అందరిలో చర్చ జరుగుతున్నది. అసలు బెంగళూరులో ఉన్న పరిస్థితులకు హైదరాబాద్ స్థితిగతులకు పొంతనే ఉండదని గ్రేటర్‌కు చెందిన పట్టణ విభాగ నిపుణుడు చెప్పారు. టెక్నాలజీ పరంగా అక్కడి సెన్సార్‌ల వ్యవస్థ బాగానే ఉన్నా.. డిజాస్టర్ పరంగా బెంగళూరు మేనేజ్‌మెంట్ సక్సెస్ కాలేదని, అసలు హైదరాబాద్‌లో బెంగళూరు సిస్టమే పనిచేయదన్నారు.

### మరో వంద చెరువులపై దృష్టి..

హైదరాబాద్‌లో వంద చెరువులపై హైడ్రా దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన జాబితాను కూడా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్‌కు అందించారు. ఇందుకు సంబంధించి కొన్ని చెరువులను సీఎస్ఆర్ కింద, మరికొన్ని చెరువులను హెచ్ఎండీఏ నిధులతో అభివృద్ధి చేయనున్నారు. బెంగళూరులో చెరువుల పునరుజ్జీవం ఎలా జరిగిందో అధ్యయనం చేసి ఆ తర్వాత హైదరాబాద్‌లో చర్యలు చేపడుతారని హైడ్రా బృందం చెబుతున్నది.